# మ్యానిఫెస్టో సూపర్

## కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం ఖాయం

- ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బీఆర్ఎస్ మ్యానిఫెస్టో
- పేద, మధ్యతరగతి వర్గాలకు ప్రాధాన్యం
- 'కేసీఆర్ బీమా'తో బీపీఎల్ కుటుంబాలకు ధీమా
- ఆరోగ్యశ్రీ పరిమితి పెంపుతో ఆరోగ్యానికి భరోసా
- వృద్ధులు, దివ్యాంగులకు మరింత ఆసరా
- ₹400కే సిలిండర్‌తో తగ్గనున్న భారం
- రేషన్‌కార్డు దారులకు సన్నబియ్యం
- పెట్టుబడి సాయం పెంపుతో రైతుకు ప్రోత్సాహం
- అగ్రవర్ణ పేద పిల్లల కోసం గురుకులాలు
- గులాబీ ఎన్నికల ప్రణాళిక అద్భుతమన్న వివిధ వర్గాలు
- అధినేత కేసీఆర్ ప్రకటనపై హర్షాతిరేకాలు

ధర్మపురి: పట్టణంలోని నంది చౌక్ వద్ద సంబురాలు జరుపుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు



జగిత్యాల, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ విడుదల చేసిన మేనిఫెస్టో పేదల పక్షపాతిగా కనిపిస్తోంది. మానవీయ కోణంలో ఆలోచన చేసిన బీఆర్ఎస్ అధినేత అడుగడుగునా వారి సంక్షేమాన్ని గుర్తు చేసేలా ఉంది. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి రెండు సార్లు అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇవ్వని అనేక అంశాలను రాష్ట్ర ప్రజల కోసం అమలు చేసింది. రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాలను గడచిన రెండు ఎన్నికల మేనిఫెస్టోలో ఎక్కడా చెప్పలేదు. కానీ, ఇలాంటి మానవీయ పథకాలను సమయానుకూలంగా ప్రవేశ పెట్టిన సీఎం కేసీఆర్ మేనిఫెస్టో విడుదల చేసిన సమయంలోనూ ఈ విషయాన్ని ప్రస్తావించారు. అలాగే, రాష్ట్ర ప్రజల సంక్షేమానికి అవసరమైన పథకాలను సమయానుకూలంగా ప్రవేశ పెడతామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న ఎన్నో పథకాలను దేశంలోని అనేక రాష్ట్రాలు అనుసరిస్తున్నాయి. ఇలాంటి పథకాలను తిరిగి కొనసాగిస్తామని కేసీఆర్ ప్రకటించారు. అయితే, రైతుబంధు పథకానికి ఇప్పుడు ఏడాదికి ఎకరానికి రూ.10 వేలు ఇస్తుండగా, తదుపరి అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.16 వేలకు పెంచుతున్నట్లు, వచ్చే ఏడాదిలో రూ.12 వేలు ఇచ్చి, ప్రతి ఏటా పెంచుతూ ఐదేళ్లలో రూ.16 వేలకు పెంచుతామని సీఎం కేసీఆర్ ప్రకటించారు. దీనిపై రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.. ఆసరా పెన్షన్లు కూడా పెంచుతున్నట్లు ప్రకటించారు. ఆసరా పింఛన్లు ఇప్పుడు రూ.2,016 ఇస్తుండగా దానిని రూ.5 వేలకు పెంచుతామని చెప్పారు. వచ్చే ఏడాది మార్చిలో రూ.3 వేలకు పెంచి ఇస్తామని, ఆ తర్వాత క్రమంగా రూ.5 వేలకు పెంచుతామని హామీ ఇచ్చారు. దివ్యాంగులకు రూ.6 వేలకు పెంచుతామని, వచ్చే మార్చిలో రూ.5 వేలకు పెంచి క్రమంగా రూ.6 వేలు చేస్తామని స్పష్టం చేయడంతో ఆసరా లబ్ధిదారుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఆరోగ్యశ్రీ కింద వైద్య సహాయం కోసం రూ.15 లక్షలు అందిస్తామని ప్రకటించడంతో తమ ఆరోగ్యాలకు భరోసా ఏర్పడిందని పేదల్లో చర్చ జరుగుతోంది.

### కొత్త పథకాలపై హర్షాతిరేకాలు..

బీఆర్ఎస్ మేనిఫెస్టోలో కేసీఆర్ ప్రకటించిన పలు కొత్త పథకాలపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఈ పథకాలు మహిళలకు అనుకూలంగా ఉన్నాయి. సౌభాగ్య లక్ష్మి పథకం కింద అర్హులైన మహిళలకు నెలకు రూ. 3 వేల భృతి కల్పిస్తామని, అర్హులైన వారందరికి రూ. 400లకు గ్యాస్ సిలిండర్ ఇస్తామని, జర్నలిస్టు కుటుంబాలకు కూడా రూ. 400లకే గ్యాస్ సిలిండర్ అందిస్తామని చెప్పారు. అంతే కాకుండా, జర్నలిస్టు కుటుంబాలకు ఉద్యోగుల తరహాలోనే హెల్త్ స్కీం అమలు చేస్తామని చెప్పడంతో ఈ వర్గాల్లో సంతోషం వ్యక్తమవుతోంది. బీఆర్ఎస్ మేనిఫెస్టోలో కేసీఆర్ మరో ముఖ్యమైన పథకాన్ని అమలు చేస్తామని ప్రకటించారు. ఈ పథకం ప్రతి పేద కుటుంబానికి ఎంతో ఊరటనిచ్చే విధంగా ఉంది. 'కేసీఆర్ బీమా.. ఇంటింటికి ధీమా' పేరుతో అమలు చేస్తున్న ఈ పథకం రైతు బీమా తరహాలో కుటుంబంలో పెద్ద చనిపోతే రూ.5 లక్షల బీమా సదుపాయాన్ని కల్పిస్తామన్నారు. అంతే కాకుండా, పేదల కోసం ప్రతి రేషన్ కార్డుపై సన్న బియ్యం సరఫరా చేస్తామని వెల్లడించారు. స్వశక్తి సంఘాలకు భవనాలు నిర్మించి ఇస్తామని చెప్పారు. ఇండ్ల స్థలాలు ఉంటే గృహలక్ష్మి కింద రూ.3 లక్షలు, లేకుంటే స్థలాలు పంపిణీ చేసే కార్యక్రమాన్ని చేపడతామని స్పష్టం చేశారు. ఇటు ఉద్యోగ వర్గాలను కూడా సంతోష పెట్టే అంశాలను మేనిఫెస్టోలో చేర్చారు. ఉద్యోగులకు పాత పద్ధతిలోనే పెన్షన్ ఇచ్చేందుకు కమిటీ ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడంతో ఉద్యోగుల్లో హర్షం వ్యక్తమవుతోంది. అగ్రవర్ణ కులాల పిల్లల కోసం ప్రతి నియోజకవర్గంలో ఒక రెసిడెన్సియల్ స్కూల్‌ను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఇలా ప్రతి వర్గాన్ని సంతృప్తి పర్చే విధంగా బీఆర్ఎస్ మేనిఫెస్టో ఉండటంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

### జీవన భృతి మంచి నిర్ణయం



స్వరాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతనే మహిళలకు మేలైంది. అధికారంలోకి వచ్చిన మొదటి నుంచే సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలను మహిళల పేర్లమీదనే ఇస్తున్నది. తాజాగా ఒక మానవీయ కోణంలో ఆలోచించి సీఎం కేసీఆర్ పేద కుటుంబాలకు చెందిన మహిళలకు నెలకు రూ.3 వేలు చొప్పున జీవన భృతిని అందిస్తామని ప్రకటించడం సంతోషంగా ఉంది. ఇది చాలా మంచి నిర్ణయం. మా అసోంటి పేదలకు జీవనభృతి ఎంతో ఉపయోగపడుతుంది. ఇంకా బీఆర్ఎస్ మేనిఫెస్టో చాలా బాగుంది.

**- గుండ భవ్యశ్రీ, గృహిణి, వేములకుర్తి**

### మహిళా లోకానికి తీపి కబురు



బీఆర్ఎస్ సర్కార్ బడుగు, బలహీన వర్గాలకు శుభవార్త చెప్పింది. సిలిండర్ గ్యాస్ ధరలు ఆకాశాన్ని అంటుతున్న తరుణంలో సీఎం కేసీఆర్ స్వాంతన చేకూర్చే వార్తను అందించారు. మహిళలు ఎంతో కాలంగా సిలిండర్ ధరలు తగ్గితే బాగుండు అనుకుంటున్న వేళ సీఎం కేసీఆర్ మేనిఫెస్టోలో సిలిండర్‌ను అర్హులైన కుటుంబాలకు రూ.400 అందిస్తామనడం మహిళలోకానికి తీపి కబురులాంటిదే. పేద ప్రజలకు లబ్ధి చేకూరేలా మేనిఫెస్టోలో వరాల జల్లు కురిపించిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేస్తున్న.

**- మిట్టపల్లి లావణ్య, జర్నలిస్ట్ భార్య, అర్బన్ కాలనీ, కోరుట్ల**

### అగ్రవర్ణాలకు గురుకులాల ఏర్పాటు అభినందనీయం



బీఆర్ఎస్ ఎన్నికల మేనిఫెస్టో బాగుంది. అగ్రవర్ణాల పేదల కోసం ప్రతి నియోజకవర్గానికి ఒక గురుకులాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పడం అభినందనీయం. అగ్రవర్ణాల్లోనూ ఎంతో మంది పేదలు ఉన్నారు. ఇప్పటికైనా వారిని గుర్తించి ఇలాంటి నిర్ణయం తీసుకోవడం సంతోషంగా ఉంది. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఏర్పాటు చేస్తామని, ఇంకా అగ్రవర్ణ పేదలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రకటించడంపై ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. ఉద్యోగాల్లో కూడా పరిగణలోకి తీసుకోవాలని కోరుతున్నా.

**- సిరిసిల్ల కృష్ణ చైతన్య, బీటెక్, జగిత్యాల**

### బీళ్లు పారుతున్నయి..



నాకు ధర్మారంల రెండున్నర ఎకరాల పొలం ఉంది. వరి సాగు చేస్తున్నా. గతంలో వ్యవసాయం చేయాలంటే దుఃఖమచ్చేది. పెట్టుబడి పోను ఏం మిగులుతుందని నా కొడుకులు ప్రశ్నించేటోళ్లు. కానీ బీఆర్ఎస్ సర్కారు వచ్చిన తర్వాత ఎవుసం పండుగలా మారింది. పెట్టుబడి సాయంతో బీళ్లన్నీ పచ్చగా మారాయి. రాబోయే రోజుల్లో యువత మరింత ముందుకు వచ్చి వ్యవసాయం చేసే అవకాశం ఉంది. 'నాన్న వరి ఎప్పుడు వేద్దాం..' అని నా కొడుకులు అడుగుతున్నారంటే ఎంతలా మార్పు వచ్చిందో తెలుస్తుంది. సీఎం కేసీఆర్ పెట్టుబడి సాయం బ్యాంకు ఖాతాలో వేయగానే పనులు ప్రారంభిస్తాం. రాబోయే రోజుల్లో పెట్టుబడి సాయం మరింత పెంచుతామని సీఎం కేసీఆర్ హామీ ఇవ్వడంతో ఎంతో సంతోషంగా ఉంది. కేసీఆర్ చల్లగా ఉండాలి.

**- బల్మూరి లక్ష్మణ్‌రావు, జగిత్యాల మండలం ధర్మారం**



### ఇది సంక్షేమ మేనిఫెస్టో

సకల జనుల సంక్షేమ మేనిఫెస్టో. ఆచరణాత్మకంగా, విశ్వసనీయంగా ఉంది. కేవలం రాష్ట్రంలో ఉన్న ప్రజలే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలంగాణ బిడ్డలు సైతం హర్షిస్తున్నరు. 2018 మేనిఫెస్టోలో ప్రకటించిన అంశాలన్నింటినీ వందశాతం పూర్తిచేసిన ఘనత కేసీఆర్ సర్కార్‌కే దక్కుతుంది. ఇది దేశానికే ఆదర్శం. రాబోయే ఎన్నికల కోసం కాకుండా భవిష్యత్ తరాలకు ఉపయోగపతుంది. ఈ మేనిఫెస్టోతో ప్రతిపక్షాల డిపాజిట్ గల్లంతు కావడం ఖాయం. ఇక ప్రతిపక్షాల హామీలు చూస్తే 'అమ్మకు అన్నం పెట్టనోడు చిన్నమ్మకు బంగారు గాజులు చేపిస్తా' అన్న చందంగా ఉంది. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ వంద సీట్లలో గెలువడం ఖాయం. బీఆర్ఎస్ ఎన్నారై బెహరాన్ బృందం త్వరలో రాష్ట్రమంతటా పర్యటించి విస్తృత ప్రచారం చేసి పార్టీని గెలిపిస్తాం.



**- రాధారపు సతీశ్‌కుమార్, బీఆర్ఎస్ బెహరాన్ శాఖ అధ్యక్షుడు(కోరుట్ల)**

### దివ్యాంగులకు మంచి రోజులు

సీఎం కేసీఆర్ సారు పాలనలో దివ్యాంగులకు మంచి రోజులు వచ్చినయ్. అందులో మంచి మనసున్న కొప్పుల ఈశ్వర్ సారుకు దివ్యాంగుల సంక్షేమశాఖను అప్పగించడం ఇంకా మేలైంది. గత ప్రభుత్వాలు మా గురించి కొంచెం కూడా ఆలోచించలే. కాళ్లులేని, కండ్లులేని దివ్యాంగులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ఎంత తిరిగినా పట్టించకున్న పాపాన పోలే. అప్పటి ప్రభుత్వాలు ఏదో కొంత మందికి ఇచ్చిన అరకొర పింఛన్ వారికి చాయ్ ఖర్చులకు కూడా సరిపోయేది కాదు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం వచ్చాక దివ్యాంగుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టింది. అవసరమయ్యే పరికరాలను, యంత్రాలను ఉచితంగా అందజేసింది దివ్యాంగుల్లో డిగ్రీ పూర్తి చేసిన వారికి రూ.1.20లక్షల విలువైన త్రీవీలర్ స్కూటీలను ఇచ్చింది. మేం అడుగకుండానే రూ.4016 పింఛన్ పెంచి ఇస్తున్నది. ఇప్పుడు మెనిఫెస్టోలో రూ.6వేల ప్రకటించిండు. మా బాగు కోసం ఇంతగా ఆలోచించే ప్రభుత్వమే మళ్లీ అధికారంలోకి రావాలి. మా దివ్యాంగుల పక్షాన సీఎం కేసీఆర్, మంత్రి ఈశ్వర్ సార్లకు ధన్యవాదాలు.



**- గడ్డం విఠల్, దివ్యాంగుల సంఘం మండలాధ్యక్షుడు, ధర్మపురి.**